# సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి

- డీఎంహెచ్‌వో డా.సుబ్బా రాయుడు
- యాత్ర ప్రచార వాహనాల ప్రారంభం

జైపూర్, డిసెంబర్ 16: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న భారత్ వికాసిత్ సంకల్పయాత్రను విజయవంతం చేయాలని మంచిర్యాల జిల్లా వైద్యాధికారి జీ సుబ్బారాయుడు అన్నారు. మండలంలోని ఇందారం గ్రామంలో జిల్లాకు వచ్చిన నాలుగు ప్రచార వాహనాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి జనవరి 25 వరకు జిల్లాల్లో అన్ని గ్రామాల్లో ఈ వాహనాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించబోతున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ్, అన్న యోజన, దీన్ దయాళ్ అంత్యోదయ యోజన, ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, జీవన జ్యోతి బీమా ఇతర పథకాలపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. అలాగే వాహనం వెళ్లిన ప్రాంతంలో మెడికల్ క్యాంప్ నిర్వహిస్తూ టీబీ, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ జాయింట్ డైరెక్టర్ మనోశెట్టి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.విజయ నిర్మల, జడ్పీ సీఈవో నరేందర్, డీపీవో వెంకటేశ్వర్ రావు, గ్రామ సర్పంచ్ సుమలత, డీఆర్డీవో శేషాద్రి, డీపీవో వెంకటేశ్వర్ రావు, ఎంఆర్వో రమేశ్ బాబు, ఎంపీడీవో పీ.సత్యనారయణ, లీడ్ మేనేజర్ తిరుపతి, డెమో వెంకటేశ్వర్లు, ఉజ్వల గ్యాస్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.


ఆసిఫాబాద్: యాత్ర ప్రచార రథాలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

### పథకాలపై అవగహన

ఆసిఫాబాద్,డిసెంబర్ 16: కేంద్ర ప్రభుత్వం ద్వారా చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర ద్వారా ప్రజలకు వివరించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు.జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన ఆవరణలో శనివారం జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తుకారాం, జిల్లా పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్‌తో కలిసి సంకల్ప్ యాత్ర ప్రచార రథాలను ప్రారంభించారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రచార యాత్రను విజయవంతం చేయాలని, ప్రతి గ్రామానికి ప్రచార రథం వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, జిల్లా సమాఖ్య, మండల సమాఖ్య, ఐకేపీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


దండేపల్లిలో మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

# ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకోవాలి

- డీఈవో యాదయ్య
- కెరీర్ గైడెన్స్ పట్ల విద్యార్థులకు అవగాహన

దండేపల్లి, డిసెంబర్16: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఏర్పరుచుకొని దానికి అనుగుణంగా ప్రయత్నిస్తే విజయం మన సొంతమవుతుందని డీఈవో యాదయ్య అన్నారు. దండేపల్లి మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం 9,10 వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పట్ల అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు పాఠాల బోధనతో పాటు కెరీర్ గైడెన్స్ ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ఇవ్వడం ద్వారా వారి భవిష్యత్‌కు ఒక మార్గం చూపే వారమవుతామని అన్నారు. ప్రతి విద్యార్థి ఇప్పటి నుంచే ఎలా చదవాలి.. ప్రణాళికలు ఎలా రూపొందించుకోవాలి.. నిరాశ చెందకుండా లక్ష్యాలను ఎలా చేరుకోవాలి..పరీక్షలకు ఎలా సన్నద్ధమవ్వాలి.. అనే విషయాలపై అవగాహన కలిగించారు. పది తర్వాత ఏ రంగమైతే జీవితంలో చక్కగా స్థిరపడతామో అని ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. అంతకుముందు జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు.విద్యార్థులతో మాట్లాడారు.సెక్టోరియల్ అధికారి చౌదరి, ఎంపీడీవో మల్లేశ్, వైద్యాధికారి సతీశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ శిరీష, ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాస్, పాల్గొన్నారు.


ఇందర్‌గా బీట్‌లోని అటవీ ప్రాంతంలో ఎఫ్‌బీవోలకు వివరిస్తున్న అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్

# బెజ్జూర్‌లో శిక్షణ ఎఫ్‌బీవోల పర్యటన

బెజ్జూర్, డిసెంబర్ 16 :తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ హైదరాబాద్ (ధూలపల్లి) లో శిక్షణ పొందతున్న 34వబ్యాచ్‌కు చెందిన 47 మంది ఎఫ్‌బీవోలు శిక్షణలో భాగంగా శనివారం బెజ్జూర్ అటవీ ప్రాంతంలో పర్యటించారు. ఫారెస్ట్ అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మోహన్ ఆధ్వర్యంలో బెజ్జూర్ అటవీ ప్రాంతంలో వారు పర్యటించారు. బెజ్జూర్ రేంజ్ పరిధిలోని కుశ్నపల్లి సెక్షన్, ఇందర్‌గా బీట్‌లో ఎఫ్‌బీవోలకు రాముడు-భీముడు అనే ప్రత్యేక టేకు చెట్లను చూపించారు. అదే విధంగా సమ్మక్క సారక్క వద్ద అటవీ అధికారులు శాఖాహార వన్యప్రాణుల కోసం పెంచుతున్న గడ్డి క్షేత్రాన్ని చూపించి వన్య ప్రాణుల గురించి వివరించారు. అదే విధంగా అంతరించి పోతున్న రాబందులకు ఆవాసంగా మారిన పెంచికల్ పేట రేంజ్ పరిధిలోని నందిగాం బీట్‌లోని పాలరాపు గుట్ట వద్దకు తీసుకెళ్లి రాబందుల కదలికలు వాటి ఆహారం, అవి వెళ్లే వలస ప్రాంతాలు, రాబందులు నిర్మంచుకున్న గూళ్లు తదితర విషయాలను ఎఫ్‌బీవోలకు వివరించారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని బెజ్జూర్, పెంచికల్ పేట రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతాలు రకా రకాల పక్షులు, వన్య ప్రాణులు, వాటి జీవ వైవిద్యానికి ఎంతగానో ఉపయోగ పడేలా ఈ అటవీ ప్రాంతాలు ప్రాముఖ్యతలను సంతరించుకున్నాయని వారికి సూచించారు. డీఆర్వో శ్రావణ్, ఎఫ్‌బీవో శ్రీధర్, ట్రాకర్స్ సిబ్బంది ఉన్నారు.


భీమారంలో తనిఖీ నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

# భీమారంలో అడవుల్లో విజిలెన్స్ తనిఖీలు

భీమారం, డిసెంబర్ 16 : హైదరాబాద్ నుంచి వచ్చి విజిలెన్స్ అధికారులు భీమారం అటవీ ప్రాంతంలో శనివారం తనిఖీలు నిర్వహించారు. భీమారం వనంలో 'టేకు చేట్ల నరికివేత' అని ఈ నెల 14న నమస్తే తెలంగాణ ప్రచురించింది. దీంతో విజిలెన్స్ అధికారులు వచ్చి అటవీలో తనిఖీలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ తనిఖీలు నిర్వ హించగా, అటవీ శాఖ అధికారులు హడలెత్తిపోయారు. టేకు వృక్షాలు ఎంత వరకు నేలమట్టమయ్యాయనే వివరా లపై ఆరా తీశారు. వాటి విలువ ఎంత ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. కొంతకాలంగా భీమారం అటవీ ప్రాంతంలో టేకు వృక్షాలు స్మగ్లింగ్ అవుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది.

# జాబితా సవరణను సమర్థవంతంగా నిర్వహించాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, డిసెంబర్ 16 : భారత ఎన్నికల సంఘం ఆదేశాలమేరకు ఈ నెల 20 నుంచి 2024 ఫిబ్రవరి 8 వరకు నిర్వహించనున్న ఫొటో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం నస్పూర్‌లోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, ఆర్డీవోలు రాములు, దత్తుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్‌ఎస్‌ఆర్ 2024 వరకు జనవరి 1, 2024ను అర్హత తేదీగా నిర్ధారించడం జరిగిందని, ఈ క్రమంలో ప్రీ రివిజన్ యాక్టివిటీ ఈ నెల 20 నుంచి జనవరి 5, 2024 వరకు, రివిజన్ యాక్టివిటీ జనవరి 6 నుంచి 8వ తేదీగా విభజించడం జరిగిందని తెలిపారు. ప్రీ రివిజన్ యాక్టివిటీస్‌లో భాగంగా ఈ నెల 20 నుంచి జనవరి 5 వరకు పోలింగ్ కేంద్రాల పునఃవ్యవస్థీకరణ, ఎలక్టోరల్ రోల్ వ్యత్యాసాల తొలగింపు, ఫొటో ఓటరు జాబితాలో ఓటర్ల ఫొటోలు స్పష్టంగా కనబడే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రివిజన్ యాక్టివిటీస్‌లో భాగంగా జనవరి 6 నుంచి ముసాయిదా జాబితా ప్రచురణ, 6 నుంచి 22వ తేదీ వరకు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందన్నారు. 6వ తేదీన పారామీటర్లు పరిశీలించి తుది జాబితా ప్రచురణ కోసం ఎన్నికల సంఘం అనుమతి పొంది ప్రచురణ కోసం పూర్తి వివరాలతో జాబితా రూపొందించడం జరుగుతుందన్నారు. 8వ తేదీన తుది జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. 18 ఏండ్లు నిండిన వారందరూ ఓటు న మోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# బాధితులకు సత్వర న్యాయం అందించాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్

ఎదులాపురం, డిసెంబర్ 16: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశానికి ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. 2023 సంవత్సరంలో 47 కేసులను గాను 17 కేసులు పెండింగ్, ట్రయల్‌లో 25 కేసుల విచారణలో ఉన్నాయని, 5 కేసులు పూర్తయ్యాయని తెలిపారు. ఇప్పటి వరకు రూ.24,12,500 ఉపశమనం కింద బాధితులకు పరిహారం అందించడం జరిగిందన్నారు. కేసుల పరిష్కారానికి, బాధితులకు పరిహారం అందేలా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు, బాధితులకు అందిస్తున్న న్యాయసేవలు, పరిహారంపై నివేదికను అందజేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, బాధితులకు నష్ట పరిహారం చెల్లింపులపై సమీక్షించారు.


మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్

### సంక్షేమ పథకాలు నిలిపివేస్తాం

గంజాయి సాగు చేసే రైతులకు రైతుబంధు, ఇతర ప్రభుత్వ పథకాలు నిలిపివేస్తామని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణకై జిల్లా స్థాయి అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. మత్తు పదార్థాలు, గంజాయి సాగు ,రవాణా చేసే వారిపై కేసులు నమోదు చేస్తూ ప్రభుత్వ పథకాలైన రైతుబంధు లాంటివి రాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసైన యువత, ఇతరులకు డీ అడిక్షన్ సెంటర్ ద్వారా నయం చేసే అవకాశం ఉన్నందున వాటిని వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గంజా యి స్మగ్లర్లపై పీడీయాక్ట్ నమోదు చేయనున్నట్లు తెలిపారు. గత సంవత్సరం 27 కేసులలో 64 మంది వ్యక్తులపై గంజాయి కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి దాదాపు 291 కిలోల, రూ.67,64,793 విలువ చేసే గంజాయిని స్వాధీ నం చేసుకున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి పండిస్తున్న 38 మంది వ్యక్తులను అరెస్టు చేయ డం జరిగిందని వీరిపై 20 కేసులను నమోదు చేస్తూ 133 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు, 275గంజాయి మొక్కలను సైతం స్వాధీనం చేసుకొని ధ్వంసం చేసినట్లు తెలిపారు. కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, అదనపు కలెక్టర్ ఖుష్బుగుప్తా విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ సభ్యురాలు నీలాదేవి, ఆర్డీవోలు స్రవంతి, జీవాకర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారులు సునీత, రాథోడ్ రమేశ్, శంకర్, డీఎస్పీ వీ ఉమేందర్, ఇతర శాఖ అధికారులు ఉన్నారు.